

# సీతా స్వయంవరం

## మాస్టర్ రమణ

(శోభ నడిపిన కథ)

టక్ ....టక్ ....టక్ ....

తలుపుపైన చిన్నగా చప్పుడు.

"యస్....కమిన్."

ఓరగా వేసివున్న తలుపులు తెరచు కోలేదు అంటే వచ్చింది కుమార్ కాదన్నమాట. కుమార్ అయితే 'శోభ గారూ' అని పిలుస్తాడు. అతడు అలా పిలిస్తే తనకేదో సంబరంగా ఉంటుంది. తృప్తిగా వుంటుంది. "'గారూ' అనకు

'శోభ' అంటే చాలదా" అంటే వినడు. "మర్యాద ఇవ్వదగ్గవారే కదా! ఔచిత్యం భంగం లేదుగా" అంటాడు.

ఠాగూర్ అన్నట్లు "ప్రభూ, నీ కోసం నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంచుతాను" అనిపిస్తుంది. నేను కుమార్‌కోసం ఎదురుచూడటం కుమార్ క్లాస్‌మేట్స్, జూనియర్స్ ఉన్నారు, రమణి, అనసూయ, వారిజ వాళ్ళ ముగ్గురికీ ఇతనంటే ఇష్టం.

"యూ ఆర్ లక్కీ శోభా" అంటాడు నాతో పదే పదే. నాకు అతని స్నేహం లభించడం అదృష్టం వాళ్ళ దృష్టిలో. అతను నిజానికి వాళ్ళతోనూ సరదాగా, స్నేహంగా వుంటాడు. ఏడాది రెండేళ్ళ పరిచయం వాళ్ళతో. నేను 'రీసర్చి'లో వచ్చి కలిశాను. అతని ఫేవర్‌కోసం వాళ్ళు ముగ్గురూ పోటీ పడుతుంటారని తొందరలోనే గ్రహించాను. పాపం! ఆడపిల్లలు!! అతనితో ఎవరికి వారు రహస్యంగా కబుర్లు చెప్పాలని, సినిమాలకు, షికార్లకు తిరగాలని ప్రయత్నిస్తుంటారు. అతను రిజర్వ్‌డ్....

కుమార్ రిజర్వ్‌డ్ అని నాకు అనిపించలేదు. అతనితో పరిచయం అయిన మొదటిరోజునే మంచి స్నేహపాత్రుడు అనిపించాడు నాకు. ఆ ముహూర్తబలం ఎలాంటిదోగాని ఇద్దరం ప్రాణస్నేహితులం అయినాం....ఒక ఆడపిల్లకు, మగవాడితో స్నేహం ఏమిటి అంటారు! అన్నారు కూడా. మా ఇద్దరి గురించి లోగుట్టుగా చెప్పుకున్నారు. కానీ మా ముందు ఎవరూ అనలేదు.

నేను ఆ గదిలో చేరి నెల దాటింది. సీతను చూడలేదు. సీత అంటే ఇంటి వారమ్మాయి. నేను గది తీసుకొనే ముందు సీత వాళ్ళ పిన్నిగారి వూరు వెళ్ళిందట....ఆ తల్లితండ్రులకు సీత ఒక్కతే బిడ్డ. గారాబంగా పెంచుకున్నారట, అని సీత అమ్మగారే చెప్పారు.

"యస్. కమిన్" అన్నాను. టేబిల్ మీద పుస్తకాలు, రాస్తున్న కాగితాలు సర్దుతూ....

ఎవరూ రాలేదు....నేనే వెళ్ళి తలుపు తెరిచాను.

ఎదురుగా ఒక చక్కనిచుక్క.... కుందనపు బొమ్మ....ముదురు బంగారు రంగు ఛాయ. ఇరవై ఏళ్ళుంటాయి. పొట్టీ, పొడుగూ కాదు. మరీ లావు కాదు, సన్నమూ కాదు. దేవాలయంనుండి దిగి వచ్చిన దేవతలా, వైకుంఠంనుండి వచ్చిన లక్ష్మిలావుంది. చూడటానికి రెండుకళ్ళు చాలని అందం. అమాంతం ఆ అమ్మాయిని కొరుక్కుతినాలనిపించింది. ఆ క్షణంలో "నేను మగవాడినిగా పుట్టివుంటే ఎంత బావుండేది" అనిపించింది.

"మీరు ?" ఏదో అనబోతుండగానే ఆ పిల్ల పెదాలు విప్పింది.

"నా పేరు సీత...." అన్నది పోల్చుకున్నాను.

"ఓ నువ్వా! పాపా! కమిన్...." లోపలకు వచ్చింది.

"ఎప్పుడు రావడం ఊరునుండి. మీ అమ్మగారు రోజూ చెబుతుంటారు నీ గురించి. గ్లాడ్ టు సీయు! ఆ రాజ కుమారివి నీవేనన్నమాట....మీ అమ్మ గారు అబద్ధం చెప్పలేదు. నీ అందం చిదిమి దీపం పెట్టుకోవచ్చు, ష్యూర్."

సీత సిగ్గుపడి తలవంచుకుంది.

"కూర్చో సీతాకుమారి! అడవాళ్ళ ముందే సిగ్గుపడటం అల్ట్రామోడరన్ ఫాషనా?" అన్నాను.

వాళ్ళ అమ్మ ఆ అమ్మాయిని 'పాపా' అంటుంది. అదే నాకు ఇష్టమైంది.

ఆమె కూర్చుని గది అంతా కలయ చూసింది. టేబుల్ పైనున్న పుస్తకాలు త్రిప్పింది. "మీవద్ద పెద్ద లైబ్రరీవుంది" అన్నది.

"అవును నీకు పుస్తకాలంటే మహా పిచ్చటగా....మా కుమార్‌కికూడా నీ లానే పెర్రి....ఇరవై నాలుగుగంటలూ చాలవు అతనికి. ఆఁ అన్నట్లు బి ఎ. చేశావటగా....ఎం ఏ లో చేరక పోయావా?" అని అడిగాను.

"ఎందుకు! చదివి ఏం ప్రయోజనం?" అన్నది.

"మేం చదవటంలా! ఎందుకేమిటి?"

"మీరు ఉద్యోగాలు చేస్తారు."

"నువ్వూ చెయ్యవచ్చుగా?"

"నాన్నారు ఒప్పుకోరు. పెళ్ళి చేయాలని చూస్తున్నారు"

"అట్లా చెప్పు. అమ్మాయిగారికి పెళ్ళి మీదకి మనస్సుపోయింది."

"కాదనుకోండి! కానీ నాకు పెళ్ళి కాదు." అన్నది దిగులుగా.... నేను షాక్ తిన్నాను.

"నీకు పెళ్ళికాదా? వాట్ నాన్సెన్స్ ....ఇంత అందమయిన అమ్మాయిని, ఎగరేసుకు పో యే వా ళ్ళు ఎందరో ఉంటారు."

"నిజమే. యువకులకు క ట్నం కావాలి."


"ఇవ్వలేరా! అంత పేదవారా?"

"కాదు నాన్నారు లక్షలకట్నం ఇవ్వ గలరు! కాని నన్ను చేసుకొనేవాడు 'ఇల్లరికం' రావాలట. ఇక్కడే ఉండా లట. ఈ రోజుల్లో ఎవరు 'ఇల్లరికానికి ఒప్పుకొంటారక్కా! అన్ని యోగ్య తలు ఉన్నవాడు, అసలు ఒప్పుకోడు" అన్నది.

ఆ అమ్మాయి గొంతు జీరపోయింది. ఏదో బాధవుంది.

అంత అందగత్తె! కాని ఏంలాభం? ఆ తండ్రి కోరిక ప్రకారం వచ్చేవాడికి 'స్వతంత్రం' ఉండదు. అందం, చదువు, ఆస్తి, ఉద్యోగం ఉన్నవాడు వీళ్ళఇంట్లో పడి ఉండడానికి చస్తే ఒప్పుకోడు.

కొద్దిరోజుల్లోనే సీతతో పరిచయం ప్రగాఢమైంది. రోజూ ఒక్కసారన్నా




నా గదికి వస్తుంది. వంటలో సాయం చేస్తుంది. 'అక్కా, అక్కా' అని ఆప్యాయంగా పిలుస్తుంది. అంత మంచి చెల్లెలు దొరికినందుకు సంతోషించాను కొత్త చోట. ఆ అమ్మాయికి యూనివర్సిటీ కబుర్లు కావాలి. చదువు మానుకున్నానన్న బాధవుంది. ప్రేమ కథలంటే యిష్టం! ప్రేమించుకునే వాళ్ళంటే యిష్టం.

ఒకసారి నా గదికి వచ్చినప్పుడు అడిగింది....

"ఆ ఫోటో ఎవరిది? మీ నాన్న గారిదా?" అని.

పెట్టెలోవున్న ఆచార్యజీ ఫోటో తీసి తగిలించాను. ఆ ఫోటో రోజుకి ఒక్కసారైనా చూడకపోతే వెలితిగా ఉంటుంది. ఆచార్యజీ కళ్ళలోకి చూస్తే నాలోకి కొత్త ఉత్తేజం, చైతన్యం ప్రవేశిస్తుంది.

"కాదు. మా గురువుగారు...." అన్నాను నవ్వుతూ. "హి యీజ్ మై గైడ్, ఫిలాసఫర్, గురూ" అన్నాను గర్వంగా.

అది ఆచార్య రజనీష్ ఫోటో. నేను బొంబాయిలో ఉండగా చాలాసార్లు ఆయన ఆశ్రమానికి వెళ్ళాను. ఆయన ఫిలాసఫీ నాకు నచ్చింది. ఆ యోగసాధన నచ్చింది. దానిలో చేరిన తర్వాతనే నాకు మనశ్శాంతి ఏర్పడ్డది. వర్రీ కావడం మానేశాను. అన్నింటినీ నిర్లిప్తంగా చూడటం నేర్చుకున్నాను. 'లవ్ ఈజ్ ది వరల్డ్' అని తెలుసుకున్నాను. 'ప్రేమ' అవసరం.

కేవలం సెక్సుకాదు. సెక్సు అవస

రాలు వేరు. ప్రేమ వేరు. ఆ దృష్టి తోనే నాకు కుమార్ సన్నిహితుడై నాడు.

"గురువంటే?" అమాయకంగా అడిగింది.

"అంటే మాస్టర్! అసలైన జ్ఞానం కలిగించి, ముక్తిమార్గం చూపే వాడు" అన్నాను.

"అదేమిటక్కా, నీకు చూడబోతే పాతికేళ్ళులేవు. ముక్తి, మోక్షం, గురువు అంటావ్....నీకెవరూ లేరా! పెళ్ళి చేసుకోవా?"

"అదంతా ఒక పెద్ద కథ సీతా! మరొకసారి వివరంగా చెబుతాలే" అన్నాను.

"ఈయనెవరు? మీ వారా?" అన్నది కుమార్ ఫ్రేం చేతిలోకి తీసుకుంటూ....

"ఏం! బావున్నాడా?" అన్నాను.

"ఫో అక్కా. ఎవరంటే చెప్పవా?

"తీసుకో కావాలంటే. నాకేంఅభ్యంతరం లేదు....ఐ మీన్ ఫోటో."

"నేను పోతున్నాను" అన్నది ఫోటో అక్కడ పెట్టి కోపంగా....చేయి పట్టి కూర్చోపెట్టాను.

"అతను నాకు ఏమీకాడు. ఫ్రెండ్....అతనూ నాలాగే రీసర్చి చేస్తున్నాడు. మంచివాడు" అని పరిచయం చేశాను.

"ఇతనా కుమార్ అంటే! నీ గదికి వస్తూంటాడుట కదూ?"

"ఏం వస్తే తప్పా! రాకూడదా! నా బాయ్‌ఫ్రెండ్స్ ఎవరూ ఈ గదికి రాకూడదని, గది ఇచ్చేటప్పుడు మీవాళ్లు చెప్పలేదే?" అన్నాను.

సీత మొహం అదోలా మారిపోయింది.

"నేను ఆ ఉద్దేశ్యంతో అనలేదక్కా! తప్పయితే క్షమించు" అన్నది.

* * *

కొన్ని రోజులు గడిచాయి. నేను హుషారుగా వున్న అదను కనిపెట్టి అన్నది సీత, "అక్కా ఒకమాట అడగనా?"

"అడుగు."

"నువ్వు కుమార్‌ని ప్రేమిస్తున్నావా?" తల దించుకుంది. నేను పెద్దగా నవ్వి "ఎందుకలా అనుకున్నావ్?"

"ఊరికే....ఆయన నీ గదికి వస్తారు. మీ రిద్దరూ కలసి సినిమాలకు, హోటళ్ళకు, షికార్లకు వెడుతుంటారు.... మరి ప్రేమించుకోకుండా అలా తిరగడం సాధ్యమా అని!"

"సీతా! నువ్వు పురాణకాలంలో పుట్టవలసిన దానివోయ్. సరదాగా తిరిగినంత మాత్రాన ప్రేమించుకోవాలా! అవినీతిగా ప్రవర్తించాలా! అసలు నీ ఉద్దేశ్యంలో అవినీతి అంటే ఏమిటి? పాపం ఏది? ఇవన్నీ ట్రాష్....ఈ ప్రపంచంలో పాపం, అవినీతి అనేవే లేవు తెలుసా!"

"అంటే నీవు చెప్పేది?"



"ఐ యామ్ ఎ ఫ్రీ బర్డ్, సీతా.... పెళ్ళి చేసుకున్నాను. మొగుడు వదిలేశాడు. ఒక బాబును కన్నాను. నా మొగుడికి నా ప్రవర్తనపై నమ్మకం పోయింది. అల్‌రైట్ విడిపోయాం. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. బాబును మా పేరెంట్స్ దగ్గర ఉంచి చదువుకుంటున్నాను. నాకు ఎవరిమీదనైనా యిష్టం కలిగితే అతనితో పోతాను. అదీ సెక్సు ....అంతకుమించి ఇంపార్టెన్స్ ఇవ్వను. దాన్ని ప్రేమ అనలేను."

"పోనీ కుమార్‌గారు నిన్ను కోరితే; అలా కోరే బలహీన క్షణాలు వస్తే...." సంశయంగా అడిగింది.

"ఐ హావ్ నో అబ్జెక్షన్ ....నా వల్ల అతనికి తృప్తి కలుగుతుంది అన్నప్పుడు అతనంటే నాకు అయిష్టం లేనపుడు మనస్ఫూర్తిగా అతని కోరిక తీర్చుకోవచ్చు. అంతేగాని రిజర్వేషన్స్ పెట్టుకొని, మనస్సుని కల్మషం చేసుకొని హెల్త్ పాడుచేసుకోను .... మరొకర్ని అలా చేసుకోనివ్వను.

"అతనంటే నీకు ఇష్టం లేకపోతే?"

"స్పష్టంగా చెప్పేస్తాను. మిస్టర్ ఐ డోంట్ లైక్ యూ. నా పైన అలాంటి ఆశలు పెట్టుకోవద్దు" అంటాను. దట్సాల్...."

సీతకు గందరగోళంగా ఉంది....

"నువ్వు ఎవరినీ ప్రేమించలేదా?" అన్నాను టాపిక్ మార్చుతూ.

"ఊహుం!"

"ఏం?"

"అవకాశంలేదు.... నేను చదివింది వుమెన్స్ కాలేజీలో."

"పోనీ బయట బాయ్‌ఫ్రెండ్స్ దొరక లేదా? నీ అంతటి అందగత్తెను ప్రేమించామంటూ 'క్యూ'లో నిల బడాలే!"

"కుమార్‌ను ఇంకెవరైనా ప్రేమిస్తే, ప్రేమిస్తున్నారని తెలిస్తే నీకు అసూయ కలగదా!" కాస్త సీరియస్‌గానే అడి గింది సీత.

"అతను నాకే కావాలనుకుంటే మరె వరైనా అతన్ని ప్రేమిస్తే....అప్పుడు గదా జలసీ! అతన్ని నా స్వంతం చేసు కోవాలనీ, పెళ్ళాడాలనీ నాకు లేదు."

"మరి అతను కోరితే నీవు అర్పించు కోడానికి సిద్ధం అన్నావు....దానివల్ల నీకు, అతనికి అపకీర్తి కదా?"

"నథింగ్...ఒకరినొకరు మోసంచేసు కుంటేఅది..చెప్పాగానీలాంటిఆడపిల్లలు నేటి సమాజంలో జీవిస్తున్నా, పునాదులు శతాబ్దాల వెనక వుంటున్నాయి. ఒకవేళ పెళ్ళి అయి మొగుడూ పెళ్ళాలు, ఒక రికి తెలియకుండా ఒకరు 'ఎఫైర్స్' ఉంచుకుంటే....తప్పుకదా! ఆ ఆత్మ వంచనకన్నా ఇది మేలు కదా!"

"నీకు పెళ్ళయిన విషయం, మీబాబు విషయం ఆయనకు తెలియదు కదూ?"

"ఇంతవరకు తెలియదు. అవసర మైనప్పుడు చెప్పటానికి నేను సిద్ధమే."

సీత గాఢంగా నిట్టూర్చింది.

"చూడగా నువ్వు కుమార్‌ని ప్రేమి స్తున్నట్లుంది" అన్నాను.

"సారీ అక్కా! నాకు కుమార్‌తో పరిచయమే లేదుగా...."

ఒకరోజు నేనూ, సీతా అలాంటి విష యమే తీవ్రంగా చర్చిస్తూ వుండగా, కుమార్ వచ్చాడు. సీత 'వస్తా అక్కా' అంటూ లేచింది. ఆమెను కుర్చీలోకి లాగి "ఈఅమ్మాయి తెలుసునా కుమార్. నీ ఫాన్" అన్నాను.

ఆమె తల సిగ్గుతో వాలిపోయింది.

"నేనేమైనా సినిమా నటుడినా, పెద్ద రచయితనా ఫాన్స్ ఉండేందుకు?" అన్నాడు.

"ఏం? అందానికి ఫాన్స్ ఉండ కూడదా! ఆరాధకులు, అభిమానులూ ఫాన్స్ కిందనే లెక్క. "సీత నీ ఫాన్" అన్నాను.

"అదృష్టవంతుడ్ని .... థాంక్స్ సీత గారూ" అన్నాడు.

"అలా అంటే కుదరదయ్యా బాబు! ఆమెకు పురుషస్పర్శ తెలియదు.... కనుక షేక్‌హాండ్ ఇచ్చి అభినందించు" అన్నాను.

సీత రెండుచేతులూ వెనక్కుదాచింది.

నేను చనువుగా సీత చేతిని తీసుకుని కుమార్‌కి అందించాను.

"లెటజ్ సెలబ్రేట్ దిస్ అకేషన్... కాఫీ తెస్తానుండండి" అంటూ లోపలికి వెళ్ళాను....సీత కళ్ళలో ఆరాధన....

"అన్నట్లు సీత వాళ్ళ బావను ప్రేమిం చిందట కుమార్."

"ప్రమాదంలేని ప్రేమ! అదే ఆరో గ్యానికి బెస్ట్....ఊరిమీద పడకుండా...." అన్నాడు.

"అంటే నీ ఉద్దేశం నేను బరితెగించి ....ఊరిమీద పడ్డాననా?" అన్నాను.

"అని నే ననలేదుగా....ఈ దేశంలో బావా....మరదళ్ళ ప్రేమ ఎంత పవి త్రమో తెలీదు నీకు" అన్నాడు.

"యూ షటప్" అన్నాను తీవ్రంగా.

"నాకు సీతగారిలాంటి ఓ అందమైన మరదలు వుంటే....కళ్ళు మూసుకొని ప్రేమించేవాడిని" అన్నాడు ఆమెవైపు చూస్తూ.

"గారిలాంటి ఎందుకోయ్. అసలు సీతే ఎదురుగా వుందిగా. పోనీ కళ్ళు తెరచుకొనే ప్రేమించరాదూ, ధైర్యం వుంటే" అన్నాను.

"సీతా! నిజంచెప్పు! నువ్వు మీ బావ అనే బడుద్దాయిని నిజంగా ప్రేమించే పెళ్ళికి వొప్పుకున్నావా?"

"అమ్మా నాన్నల ఇష్టం, నాదేం వుంది.

"అంటే రేపు అతగాడు నిన్ను చితక బాదినా ఫరవాలేదు. నీకు ఇష్టంలేక పోయినా కాపురం చేస్తావు."

"మన వివాహ వ్యవస్థే అంత శోభ గారూ! పెళ్ళయితే 'ప్రేమ' పుట్టు కొస్తుంది" అన్నాడు కుమార్.

"బావిలో నీరు ఊరినట్లు! అవునా? కుమార్! ఈ ఒక్క పాయింట్‌కూ నీకు పిహెచ్.డి. ఇవ్వచ్చోయ్" అన్నాను.

ఆరోజు ముగ్గురం సినిమాకు వెళ్లాం! ఏ మూడ్‌లో వున్నదో సీత వస్తానన్నది. ఆ అమ్మాయికి 'కుమార్'తో పరిచయం కావడమే ఒక పెద్ద పండుగగా ఉంది. తెగ దొంగచూపులు చూస్తోంది. ఆ చూపుల్లో ఎంతో ఆరాధన....పాపం మగ స్నేహితులు లేక అవురావురు మంటు న్నది.

* * *

[సీత చెప్పని కథ]

ఆ రోజు నా జీవితంలో మలుపు తిరి గినరోజు, మధురమైన రోజు. శోభ కోసం వచ్చినప్పుడు మొదటిసారి కుమార్‌ని చూచినప్పుడు నా మనస్సు నాది కాకుండా పోయింది. అతన్ని పదే పదేచూడాలనిపించేది. ఎన్నిసార్లుచూచినా

తనివి తీరేదికాదు. 'నేను అతన్ని ప్రేమిస్తున్నానా?' అనుకునేదాన్ని. అదేనా ప్రేమ అంటే! ప్రేమ బీజాలు నాటడం అంటే అదేనేమో?

కుమార్‌తో పరిచయం కలగలేదు. అవకాశం రాలేదు. అతను శోభకోసం వచ్చినా తలవంచుకుని వెళ్ళిపోయేవాడు ఒక్కసారి తలెత్తి నావేపు చూస్తాడేమో నని అనుకునేదాన్ని. అలా జరగలేదు. పోనీ ప్రవరాఖ్యుడా అంటే కాదు. శోభ కోసం వస్తున్నాడుగా. ఆడపిల్లలంటే భయంలేదు. అతని కోసం యూనివర్సిటీలో చాలామంది అమ్మాయిలు వలలు విసురుతుంటారని శోభే చెప్పింది. అలాంటివాడు నావైపు కనీసం కన్నెత్తి చూడకపోవటం ఏమిటి? నా అందం నచ్చలేదా! అసలు చూస్తేకదా! అందం గుర్తించడం!!

"నీ ఫ్రెండ్‌ని నాకు పరిచయం చేయవూ" అని అడగాలనిపించేది. ఎన్నిసార్లు కుమార్ ప్రస్తావన వచ్చినా తను అర్థంచేసుకొనేది కాదు. వాళ్ళిద్దరూ వుండగా తెలియనట్లు వెళ్ళాలని అనేకసార్లు అనుకున్నాను. కానీ చదువూ, సంస్కారం అడ్డువచ్చేవి. గుమ్మం వరకు వెళ్ళి వెనుతిరిగి వచ్చేదాన్ని....

ఒకరోజున నేను శోభగది కిటికీవద్ద నిలబడి వున్నాను. లోపల శోభ, కుమార్ వున్నారు. శోభ నిలువుటద్దం ముందు నిలబడి ముస్తాబు చేసుకుంటోంది. ఆమె పూలు తలలో పెట్టుకోబోతుండగా 'నేను పెట్టనా?' అన్నాడు కుమార్ దగ్గరగా వెళ్ళి.

"అంత సరదాగా వుంటే పెట్టరాదూ. నే వద్దన్నానా" అన్నది శోభ నవ్వుతూ, చిలిపిగా, కవ్వింపుగా అతనివైపు చూస్తూ.

కుమార్ ఆమె తలలో పూలుతురిమి భుజాలపై చేతులువేసి, తల పైకెత్తి ఆమె పెదాలమీద ముద్దుపెట్టుకున్నాడు. శోభ చివ్వునలేచి ఎదురుగా నిలబడ్డది.

"నువ్వు ఎలా ఉన్నావో చెప్పనా?" అడిగాడతను.

"ఊ(" అన్నది కొత్తపెళ్ళికూతురిలా సిగ్గుపడుతూ....

"అచ్చం రతీదేవిలా వున్నావుశోభా"

"పెద్ద రతీదేవిని చూచినట్లు మన్మధుడు వచ్చాడండీ" అన్నది.

"నీ పెదాలు చూస్తుంటే కొరికేయాలనిపిస్తోంది."

"పిచ్చి కన్నయ్యా! ఎంత ఆరాటం" అంటూ కుమార్‌ని కౌగిలిలో బంధించి పెదాలు అందించింది. ఆలింగనంలో ఆమె కళ్ళు మత్తుగా, అరమూతలు పడటం నేను గమనించాను —

"చాలా, ఇంకేమైనా కావాలా?" అన్నది శోభ.

"అంటే....అంటే...." నాకు పాదాలలో చెమట పట్టింది.

ఆ మాటలే నా చెవుల్లో మారుమ్రోగాయి. వారిద్దరినీ ఎన్నోరకాల, ఎన్నో

భంగిమల్లో ఊహించుకున్నాను. ఆ క్షణంలో అతని కౌగిలిలో శోభ బదులు నన్ను ఊహించుకున్నాను. ఎంతో తృప్తి కలిగింది. ఎంతో ఉద్రేకం కలిగింది....రిలీఫ్ కలిగింది. గదికి వచ్చేసాను. ఆరోజు రాత్రి ఎంతోసేపు ఏడ్చాను ఒంటరిగా తలుపులు వేసుకుని —ఎందుకు?

వాళ్ళతో కలిసి సినిమాకు వెళ్ళటం ఒక మంచి అవకాశం. కుమార్ పక్కనే నడుస్తుంటే నా కెందుకో గర్వంగా ఉంది. తృప్తిగావుంది. సినిమాహాలులోకుమార్ ప్రక్కనే శోభ కూర్చుంది. నేను శోభ ప్రక్కనే కూర్చుందా మనుకున్నాను. అక్కడ ఖాళీలేదు. కుమార్‌కి రెండవ వైపు కూర్చోవలసి వచ్చింది. చాలా ఇబ్బంది అనిపించింది. ప్రక్కకు వత్తిగిలి కూర్చున్నాను.

ఒక సందర్భంలో నా చేతిని కుర్చీ హాండ్‌మీద వేసినప్పుడు అక్కడ కుమార్ చేయివుంది. షాక్ కొట్టినట్లు చేతిని తీసుకొన్నాను. అతను చేతినితీసుకొని వాళ్ళో పెట్టుకున్నాడు మర్యాదగా ....మరొకసారి కుర్చీ హాండ్‌మీదవున్న నా చేతిపైన కుమార్ చేయిపడ్డది. నేను వెనక్కు తీసుకోలేదు. అతనూ తీసుకోలేదు. ఓ క్షణం తర్వాత కుమార్ తన అరచేతిలోకి, నా అరచేతిని తీసుకుని వేళ్ళు పెనవేశాడు. మొదట భయపడ్డాను. అంతలోనే ఆ స్పర్శకు చాలా సుఖంగా అనిపించింది. అతనివేపు చూశాను. చీకట్లో అతనికళ్ళు నాకళ్ళనే చూస్తున్నాయి. శోభ మమ్మల్ని గమనించలేదు.

కుమార్‌తో పరిచయం అయిన తరువాత బావ అంటే అయిష్టం ఏర్పడసాగింది. కారణం ఇది అని చెప్పలేను గానీ కుమార్‌తో ఏ విషయంలోను బావను పోల్చడానికిలేదు. అయితే నేను కుమార్‌ని ప్రేమించగలనా? శోభ అడ్డుగావుంది.

శోభ పైకి కబుర్లు చెబుతుందిగానీ, కుమార్ అంటే వల్లమాలిన ఇష్టం. కాకపోతే అతని ఫోటో ఎందుకు టేబుల్ మీద పెట్టుకుంది. ఆడవాళ్ళ మనసు ఆ మాత్రం నేను గ్రహించలేనా? అతనికీ శోభ అంటే ఇష్టమే. కాకపోతే అంత చనువుగా ఎందుకుంటాడు? పైగా తనకు పెళ్ళయిందని నాతో చెప్పింది. అబద్ధం కావచ్చు. చూస్తే పెళ్ళయిన దానిలా కనిపించదు. పైగా ఒక పిల్లాడట. నమ్మటం ఎలా! పొరుగూళ్ళకు వెళ్ళి చదువుకునే ఆడపిల్లలు ఇలాగే మెడలో సూత్రాలు వేసుకుంటారు. పెళ్ళి అయిందనీ మాఆయన అమెరికాలో చదువుతున్నాడనో, మరెక్కడో ఉన్నాడనో అబద్ధం చెబుతారు. పెళ్ళయిన పిల్లల్ని సాధారణంగా ఎవరూ ఆశించరు. వాళ్ళను అల్లరిపెట్ట సాహసించరు. అందుకే అమ్మాయిలు ఆ

టెక్నిక్ ఉపయోగిస్తారు. ఏనాటికైనా శోభ కుమార్‌ని ఎగరేసుకుపోతుందనే నా అనుమానం.

మూడునెలలు గడిచిపోయాయి. నాన్న గారు నాకు వేరే సంబంధాలు చూస్తున్నట్లు తోచింది! ఏమిటి చెప్మా! బావకు ఏమైంది! పైగా బావన్నా, వాళ్ళవాళ్ళన్నా మండిపడుతున్నాడు నాన్న. కారణం ఊహించలేకపోయాను.

ఒకరోజున కుమార్ తలనొప్పితో శోభ గదికివచ్చాడు. చాలా అలసిపోయినట్లున్నాడు.... నిమిషాలలో జ్వరం ముంచుకొచ్చింది. తెల్లవారేసరికి జ్వరం తీవ్రమయింది వారంరోజులు పాపం, మూసినకన్ను తెరవలేదు. బాధతో మూలుగుతూనే ఉన్నాడు. శోభ సెలవు పెట్టి ఇంట్లోనేవుంది. నేనూ దాదాపు అక్కడే ఉంటున్నాను. వాళ్ళ కాలేజీ పిల్లలు, లెక్చరర్లు చాలామంది కుమార్‌ని చూడటానికి వచ్చారు.

కుమార్‌కి జ్వరం తగ్గింది. పథ్యం పెట్టారు. మరో పదిరోజులైనా బెడ్ రెస్ట్ అవసరమని డాక్టరు చెప్పాడు. నన్ను కనిపెట్టి వుండమని చెప్పి శోభ కాలేజీకి వెళ్ళింది. అతను పగలు నిద్ర పోకుండా ఎంగేజ్ చేయటం నా పని. సరదాగా కార్డ్స్ ఆడేవాళ్ళం. కారంబోర్డు తెప్పించాను. అతనంటే అమ్మకూ, నాన్నకూ అభిమానం ఏర్పడ్డది. అమ్మే హార్లిక్స్, బార్లీ, టిఫినూ పంపేది టైం ప్రకారం.

ఆ పదిరోజులలో కుమార్‌తో అరమరికలు లేకుండా ఉన్నానేమో అతనంటే మరీ యిష్టం, చనువూ ఏర్పడ్డాయి. ఆ మర్నాడు అతను వెళ్ళిపోతానంటే దిగులు పట్టుకుంది.

ఆరోజు నా పుట్టినరోజు. కుమార్ వెళ్ళిపోతాడన్న దిగులుతో పండుగ చేసుకోదలచలేదు. అమ్మ కోప్పడ్డది. తలంటి స్నానంచేసి కొత్తచీర కట్టుకున్నాను. దేవుడికి కొబ్బరికాయ కొట్టి, కర్పూరం వెలిగించాను. అన్నిచేస్తున్నా నా కళ్ళలో మెదులుతున్నది కుమార్ రూపమే. ఎంత ప్రయత్నించీ అతని రూపాన్ని, నాలోనుండి, ఆలోచనల నుండి తొలగించలేక పోతున్నాను.

మధ్యాహ్నం స్వీట్స్ చేసింది అమ్మ ...."ఆ అబ్బాయికి ఇచ్చిరా" అని పురమాయించింది. నేను వెళ్ళేసరికి ఏదో పుస్తకం చదువుతున్నాడు.

"రావేమో ననుకున్నాను" అన్నాడు పుస్తకంలోంచి తల ఎత్తకుండానే....

"ఎందుకనుకున్నారు ?"

"ఏదీ ప్రొద్దుటనుండీ దేవిగారిదర్శనం కాందే మరి."

"ఇవ్వాళ నా పుట్టినరోజు" అన్నాను.

కుమార్ తలెత్తి చూచాడు.

"హేపీ బర్త్‌డే టు యు సీతా, మెనీ హేపీ రిటర్న్స్" అని చేయి అందించాడు ....నేనూ చేయి అందించాను.

"నిన్ననే ఈ విషయం చెబితే మంచి ప్రజెంటేషన్ తెప్పించేవాణ్ణిగా."

"పోనీ ఇప్పుడైతేనేం, బజార్నకొనలేని దేదైనా ఇవ్వండి....ఎప్పటికీ మరచిపోలేని బహుమతి" అన్నాను.

ఆలోచించాడు.

"అభ్యంతరం పెట్టకూడదు" అన్నాడు నవ్వుతూ.

"నాట్ ఎటాల్" అన్నాను సిగ్గుతో.

"ఆ తలుపు వేసిరా....యిస్తా."

"అమ్మ, ఎంతాశ."

నేను తెచ్చిన స్వీట్స్ నా నోట్లో పెట్టాడు "ఊ".

సగం కొరికాను....మిగతా సగం తన నోట్లో వేసుకున్నాడు. నేను దిగ్భ్రమ చెందాను.

"ఛ ! ఎంగిలండీ" అన్నాను.

"నీ అధర అమృతం సోకిన స్వీట్ ఎంత తియ్యగా ఉంది, నీ మనస్సులాగే" అన్నాడు.

అతను లేచివచ్చి నా భుజాలమీద చేయి వేశాడు. లేచి నిలబడ్డానుభయంగా ....అతను తలుపు గడియవేసి వచ్చి నన్ను కౌగిలిలోకి తీసుకుని పెదాలు ముద్దుపెట్టుకున్నాడు ! ఇదే నా బహుమతి !"

నాలో ఏదో విద్యుత్ ప్రవహించింది మరేదో మత్తు నన్ను అవహించింది. "కుమార్" అంటూ అతనిని లతలా పెనవేసుకుపోయాను.

"కుమార్ నన్ను ప్రేమించగలవా ?" అన్నాను.

"యు ఆర్ మై డ్రీమ్ గరల్" అన్నాడు నాకన్నా ఎక్కువ తమకంతో. పారవశ్యంతో.

"సాయంత్రంవరకు శోభ రాదు" అన్నాడు.

"హౌ స్వీట్ యు ఆర్" అన్నాను.

* * *

[కుమార్ మలిచిన కథ]

టక్....టక్....టక్....

తలుపుపైన చప్పుడు. నా కౌగిలిలో వున్న సీత ఉలిక్కిపడ్డది. నేను భయపడ్డాను. 'రాదు' అనుకున్న శోభ వచ్చిందా ! లేక సీత అమ్మగారు వచ్చారా ! మా రహస్యం బట్టబయలు అవుతుందా ! పాపం ! సీతకు చెమటలు పోస్తున్నాయి. వొణికిపోతున్నది.

"డోంట్ వర్రీ సీతా" అని ఆమె వీపు తట్టాను. టేబుల్‌మీద పేక పరిచాను. అటు యిటు కుర్చీలు జరిపాను. సీతను ఓ కుర్చీలో కూర్చోబెట్టి చేతిలో పేకముక్కలు పెట్టి "మనం పేకాడుకుంటున్నాం....ఆ వొణుకు తగ్గించు" అని చుబుకంపట్టి ఊపి నా చేతిలో పేక ముక్కలు సర్దుకుంటూ గుమ్మం దగ్గరకు వెళ్ళి తలుపు తెరిచాను.

"హలో....శోభా....ఈరోజువర్క్ లేదా ?" అన్నాను సిగరెట్ వెలిగించుకుంటూ....

"ఓ....సీతకూడా ఇక్కడే వుందా ....వెరీగుడ్."

"హమ్మయ్య, గండం గడిచింది."

ఆ మర్నాడే నేను నా గదికి వెళ్ళి పోయాను....నాకు జ్వరం తగిలి లంఖణాలు చేశానని తెలిసి మా నాన్నగారు వచ్చారు చూచిపోవడానికి....నాన్నగారూ, సీత ఫాదర్ స్నేహితులట. బజార్లో కనిపించి, తన ఇంటికి తీసుకు వెళ్ళి, సీతను చూపించాడట సంబంధాలు చూస్తున్నామనీ, మంచి సంబంధం దొరికితే ఎంత కట్నమయినా యిస్తానని చెప్పాడట....నాన్నకు సీత బాగా నచ్చింది నా సంగతి చెప్పాడట. ఆయనగారు ఎగిరి గంతు వేశాడు....

నన్ను పెళ్ళి చూపులకి పంపిస్తానని, నాకు నచ్చితే ముహూర్తాలు పెట్టుకోవచ్చని మాట యిచ్చి వచ్చాడు....నాతో చెప్పారు నాన్న.

ఆయన వర్ణించిన స్నేహితుడు సీత ఫాదర్ అని ఆ అమ్మాయి సాక్షాత్తు సీత అని, అడ్రసు యిచ్చాక తెలిసింది.

వాళ్ళు నాకు తెలుసనీ, సీత నాకు తెలిసిన అమ్మాయి అని నాన్నగారితో చెప్పలేదు....తర్వాత ఉత్తరం రాస్తానని చెప్పి పంపాను.

నేను ఫలానా అని రంగనాధంగారికి తెలియదు. తెలిస్తే నాన్నగారితో ఈ విషయం ప్రస్తావించేవాడు కాడు. శోభకూ నాకూ వున్న పరిచయం ఆయనకు తెలియంది కాదు. మరొక అమ్మాయితో స్నేహంచేసే అబ్బాయికి ఏ తండ్రీ తన కూతురునిచ్చి చేస్తాననడు.

నాలుగురోజులు పోయాక నాన్నగారికి ఉత్తరం రాశాను, నేను ఆ అమ్మాయిని చూచానని, నచ్చిందని.

ఒకరోజున నేను శోభగదిలో ఉండగా సీత వచ్చి ఏడ్చినంత పనిచేసింది.

"నాకు పెళ్ళి సెటిల్ అయింది కుమార్" అన్నది.

"కంగ్రాచ్యులేషన్స్" అన్నాను.

"ఏం వేళాకోళంగా వుందా" అన్నది నా వైపు కొరకొరా చూస్తూ.

"ఎవరితోనని అడగవేం?"

"ఎందుకు అడగటం, నీకు యిష్టం లేనివాడితో అయితే సెటిల్ కాదుగా."

"నేను ఆ సంబంధం చేసుకోవడం లేదు."

"ఏం చేస్తావ్?"

"గంగలో దూకి చస్తాను."


"కాశీదాకా వెళ్ళి."

"షటప్....నాకు మాట యిచ్చావు, మరచిపోయావా?"

"ఎలా మర్చిపోతాను. ఐ లవ్ యూ సీతా."

"ఈ కబుర్లు చెప్పకండి....అవతల కొంపలు మునుగుతుంటే ఇంకా ఐ లవ్ యు అని వల్లిస్తున్నారా?"

"ఇంతకీ ఎవరా అదృష్టవంతుడు?"



"మీరు మాత్రం కాదు....ఎవరో మా నాన్నగారి ఫ్రెండట....."

"అయ్యబాబోయ్. వయస్సు యాభై వుంటుందన్నమాట."

"ఆయనగారి పుత్రరత్నం."

"అమ్మయ్య బ్రతికించావ్."

"ఆయనగారు నన్ను చూచాడట, నచ్చానుట, ముహూర్తాలు పెట్టుకుందాం అని రాశాడు."

"పెళ్ళికొడుకు నీకు నచ్చాడా ?"

"....అదేకదా నా బాధ....అతను నన్ను చూడలేదు....అతన్ని నేనూ చూడలేదు."

"చూచే వుంటావు."

"షటప్ ; ఈ సంబంధం చేసుకోనని నాన్నగారితో చెప్పేశాను."

"పనిలో పనిగా నన్ను ప్రేమిస్తున్న విషయంకూడా చెప్పేయకపోయావా ?"

"నా మొహానికి ప్రేమకూడానా" అని తంతారు.

"పోనీ ఓ పని చేద్దాం....గాంధర్వ వివాహం చేసుకుందాం."

"ఇంకానయం లేచిపోదాం అనలేదు! మీ సలహాకు థాంక్స్" అన్నది మూతి ముడిచి.

"ఓ ముద్దిస్తే మంచి సలహా చెబుతా" అన్నాను.

"ఊ....చెప్పండి" అన్నది దగ్గరగా వచ్చి.

గట్టిగా ముద్దు పెట్టుకుని "మనం ఇలాగే శాశ్వతంగా ఉండిపోయే వరం ఏ దేవతైనా ఇస్తే ఎంత బావుణ్ను."

"కబుర్లు ఆపి సలహా చెప్పండి."

"ఆ అబ్బాయి ఫోటో ఒకటి అర్జంటుగా పంపమని ఉత్తరం రాయించు. తర్వాత ఆలోచిద్దాం" అన్నాను.

"థాంక్స్" అన్నది.

మూడురోజులు నేను ఆ ఛాయలకు వెళ్ళలేదు. నాల్గవరోజున రంగనాథంగారు నా గది వెతుక్కుంటూ వచ్చారు. ఆయన వస్తారని నాకు తెలుసు...ఆయన రాకపై మా పెళ్ళి ఆధారపడివుంది. రాకపోతే సీత పై ఆశ వదులుకోవలసి వచ్చేది.

ఆయన్ని మర్యాదగా ఆహ్వానించాను.

"ఏమిటి సర్ విశేషాలు....సీత కులాసా?" అని అడిగాను.

"అదేనోయ్—నాలుగురోజులనుండి జ్వరం. లేవడంలేదు. నీకోసం పలవరిస్తోంది. ఓ మారు రాగలవా?" అన్నారు దీనంగా.

నాకు గాభరా వేసింది. వెంటనే అదరాబాదరా బట్టలు వేసుకొని "పదండి పోదాం" అన్నాను.

ఆటోలో వెడుతూ అడిగాను. "మామూలు జ్వరమేనా? ఏ డాక్టరుకు చూపించారు?"

ఆయన ఏదో సమాధానం చెప్పారు గానీ నా చెవికెక్కలేదు. మనస్సునిండా సీత రూపమే.

ఇంటికి వెళ్ళాక....

"ఎక్కడుందండీ...." అని అడిగాను.


"తన గదిలోనే వుంది....వెళ్ళవయ్యా బాబూ" అన్నాడాయన. మేడ మెట్లు ఎక్కుతుండగా సీత అమ్మగారు ఎదురైనారు. ఆమెను కళ్ళతోనే పలకరించి, సీత గదికి పరుగుతీశాను.

మంచంమీద అటు తిరిగి పడుకుని వుంది.

"సీతా, సీతా" అని పిలిచాను.

కళ్ళు విప్పింది. మనిషి నీరసంగా లేదు.

"ఏం జ్వరం?" అన్నాను చేయి నుదిటిపై వేస్తూ....




ఆ చేయి పట్టుకుని మంచంమీదకి లాగింది....

"జ్వరంలేదా ?" అన్నాను.

"ప్రేమ జ్వరమన్నమాట ?"

అమాంతం నా మెడచుట్టూ చేతులు బిగించింది.

"ఆ అబ్బాయి ఫోటో వచ్చింది" అన్నది.

"నచ్చాడా ?"

"ఉహూఁ" అన్నది.

నా చేతులు అప్పటికే సీతను పెన వేశాయి.

నా పెదాలు ఆత్రంగా ఆమె పెదాలను అందుకున్నాయి.

రెండు నిమిషాల తర్వాత చేయి చాచింది.

"ప్రమాణం చెయ్యండి"

"ఏమని ? ఎందుకు ?"

"తమరు ఇకనుండీ శోభ గదికి వెళ్ళకూడదు. ఆవిడతో స్నేహం తగ్గించాలి."

"పాపం ఆవిడేం చేసింది !"

"మీ ప్రేమ మరొకరు పంచుకోవడం నేను సహించను."

"పిచ్చి సీతా" అన్నాను. సీతను మరీ దగ్గరకు తీసుకుంటూ.

"ఉయ్ షుడ్ థాంక్ హర్" అన్నాను.

———